వేసవిలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు

- ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి
- నాణ్యతతో కూడిన తాగునీరు సరఫరా చేయాలని ఆదేశాలు



వేసవిలో మంచినీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తోన్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: వేసవిలో నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం ముదునూరి తన కార్యాలయంలో అధికారులతో వేసవిలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ వేసవికాలం సమీపించిన దృష్ట్యా అధికారులు అప్రమత్తం కావాలన్నారు. నియోజకవర్గంలో మూరుమూల ప్రాంతాల్లోనూ పరిశుభ్రమైన మంచినీరు సరఫరా కావాలని చెప్పారు. అందుకు తగ్గ ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది ఎండలు తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పరిశుభ్రమైన నీరందించాలని చెప్పారు. ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలన్నారు.

చెరువులు పూర్తిస్థాయిలో నింపాలి

కాలువలు కట్టే సమయానికి మున్సిపాలిటీ, అటు గ్రామాల్లో మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించారు. చెరువులు నింపడానికి ముందు ఉపాధి కూలీలతో గ్రామాల్లో చెరువులో వ్యర్థాలు, పూడిక తీయించాలని ఆదేశించారు. క్లోరినేషన్ ప్రక్రియ సక్రమంగా సాగాలన్నారు. వేసవి పూర్తయ్యే వరకూ నిరంతర నిఘా ఉండాలని, కుళాయి ద్వారా మంచినీరు చేరని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆర్‌వీ రాజు, ఏఈలు విజ్జేశ్వరరావు, నరేష్, పంచాయతీరాజ్ డీఈఈ కేడీఆర్ స్వామి, ఏఈలు అశోక్, నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ మోహన్‌కృష్ణ, నరసాపురం జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ పాల్గొన్నారు.

గైర్హాజరైన వారికి నోటీసులు జారీ చేయండి

నరసాపురం రూరల్: మండల పరిషత్ సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్ కుమార్‌ను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచే మండల సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడం సమంజసం కాదన్నారు. శాఖల వారీగా హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. రానున్న వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మండలానికి సంబంధించి రూ.21 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. పశువుల చెరువులు, రజకుల చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలోనూ శ్మశాన వాటికలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా గ్రామంలోని సచివాలయాల పరిధిలో వైద్య సేవలు అందిస్తున్నామని, కాళీపట్నంలో రూ.2.60 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు వివరించాలని సూచించారు.

నేడు శ్రీరామనవమి శోభాయాత్ర

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో బుధవారం శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తామని ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు గాదె వెంకన్న తెలిపారు. గురువారం 30వ తేదీన శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని ముందురోజు బుధవారం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ రామాలయం నుంచి ఈ శోభా యాత్ర ప్రారంభమవుతుందన్నారు. రామ భక్తులందరూ ఈ యాత్రలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయాలన్నారు. పట్టణంలో సుమారు 30 రామాలయాలు ఉన్నాయని శ్రీరామనవమి రోజున ప్రతి రామాలయానికి వెళ్లి పట్టు వస్త్రాలు అందించాలని సంకల్పించినట్లు తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

యూనివర్సిటీ పోటీల్లో వైఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం: వైఎన్ కళాశాల మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఇటీవల రాజమండ్రి నన్నయ యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించినట్టు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ చెప్పారు. బిజినెస్ ప్లాన్ ఈవెంట్‌లో ఎస్ హేమ ద్వితీయ బహుమతి, వీ. లక్ష్మీసునీత పాశ్చాత్య నృత్యంలో ప్రథమ బహుమతి సాధించారు. యూ.రవితేజ, ఎస్ మేమలు సావిష్కర 2కే23 టైటిల్‌ను సాధించారని చెప్పారు. విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ అప్పన ఫణి, పీజీ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఎస్ చింతారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, డాక్టర్ చినిమల్లి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

అనధికార లే అవుట్‌లో రోడ్లు ధ్వంసం



16వ వార్డులో అనధికార లేఅవుట్‌ను ధ్వంసం చేస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని 16వ వార్డు గాంధీనగర్‌లో వేసిన అనధికార లేఅవుట్‌పై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. సుమారు 70 సెంట్ల స్థలంలో అనుమతులు లేకుండా వేస్తున్న లేఅవుట్‌ను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు మంగళవారం ధ్వంసం చేశారు. లేఅవుట్‌లో వేసిన రోడ్లు జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతులకు అండగా సొసైటీ సేవలు

పెనుగొండ: మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో వల్లూరు సొసైటీని అభివృద్ధి చేసిన రైతులకు అండగా నిలిచినట్టు వల్లూరు సొసైటీ చైర్ పర్సన్ నారిన వీర వెంకట సత్యనారాయణ అన్నారు. మంగళవారం సొసైటీ మహాజన సభ నిర్వహించారు. ఏడాది కాలంలో రూ.4.20 కోట్లు స్వల్పకాలిక రుణాలు, రూ.1.12 కోట్లు దీర్ఘకాలిక రుణాలు, రూ.1.50 కోట్లు ఎంపీసీసీ రుణాలు అందించామన్నారు. 2020–21 సంవత్సరానికి రైతులకు రూ.8,28,850 పావలా వడ్డీని వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ ఏడాది మరింతగా రైతులకు రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2023–24 అంచనా బడ్జెట్, జమా ఖర్చులను ఆమోదించారు. కార్యక్రమంలో పర్సన్స్ గంగోలు శ్రీనివాసరావు, పెచ్చెట్టి సత్యనారాయణ, కార్యదర్శి యేడిద వెంకట కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

పోషకాలతో ఆరోగ్యం



కొడమంచిలిలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, చిన్నారులు

పెనుగొండ: అంగన్‌వాడీల ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని పిల్లలకు, కిషోర్ బాలికలకు, బాలింతలు సక్రమంగా పంపిణీ చేసి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొడమంచిలి సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పోలిశెట్టి దుర్గాభవానీ, గున్నాబత్తుల కామేశ్వరి, సల్లపూడి సుజాత, కోట రజిని, నక్కా పీటీకుమారి, కలగట లక్ష్మీ, మాధవి, ఎంఎల్‌హెచ్‌ఓ రూప, ఏఎన్ఎం వెంకటరమణ పాల్గొన్నారు. పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గర్భిణులకు, బాలింతలకు, కిషోర బాలికలకు పోషణ పక్వాడా వారోత్సవాల ప్రాముఖ్యతను డాక్టర్ సులక్షణ వివరించారు. సూపర్ వైజరు ఎం విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై ఉచిత శిక్షణ

ఆకివీడు : ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు వెళ్లే అభ్యర్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు 40 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలో వీవీ గిరి డిగ్రీ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 రోజులపాటు ఆంగ్ల భాషపై కోచింగ్ ఇస్తామన్నారు. సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకూ శిక్షణ ఉంటుందన్నారు. అధ్యాపకులు కె.బాల గురవయ్య బోధిస్తారని ఆమె తెలిపారు.

బాలుడి వైద్యానికి రూ.2.50 లక్షలు మంజూరు



గుండె వ్యాధితో బాధపడుతున్న కౌశిక్ (4) వైద్యం నిమిత్తం రూ.2.50లక్షల చెక్కును అందజేస్తున్న జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పట్టణానికి చెందిన వడ్రంగి మేస్త్రి అన్నాబత్తుల ప్రసాద్ కుమారుడు కౌశిక్(4) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. బాలుడు వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ రూ.2.50లక్షలు మంజూరు చేయించారు. కౌశిక్ చెడు రక్తనాళం పూర్తిగా పాడైపోయింది. వైద్యం కోసం ఆర్థిక సహాయం మంజూరు చేయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని, శ్రీ క్షీరారామ కార్పెంటర్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పోతాబత్తుల దుర్గాప్రసాద్ తదితరులు కవురు శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శ్రీనివాస్ స్పందించి బాలుడు సమస్యను స్వయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అత్యవసర శస్త్ర చికిత్స నిమిత్తం రూ.2.50లక్షలు మంజూరు చేయించి బాలుడు శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేశారు. దీంతో కవురు శ్రీనివాస్‌ని పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో కౌశిక కుటుంబ సభ్యులు మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఖాతాదారులకు నాణ్యమైన సేవలందించాలి

పాలకొల్లు అర్బన్: ఖాతాదారులకు నాణ్యమైన సేవలందించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి మెయిన్‌రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ ఉమ్మడి జిల్లాలోని 25వ బ్రాంచ్‌ను శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. బ్రాంచ్ పరిధిలోని రైతులకు, డ్వాక్రా మహిళలకు, ప్రజలకు వారి అవసరాలను బట్టి రుణాలను సకాలంలో అందజేసి ఆర్థిక అవసరాలు తీర్చాలని శ్రీనివాస్ కోరారు. హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ ఇన్‌చార్జ్ బలిజేపల్లి రామమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 804 బ్రాంచ్‌ల ద్వారా రూ.3,450కోట్ల వ్యాపారం సాగిస్తున్నట్లు చెప్పారు. ఖాతాదారులకు 24 రకాల రుణాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఆక్వా, రైస్‌మిల్లింగ్ తదితర రంగాలకు పెద్ద మొత్తంలో రుణ సౌకర్యం అందిస్తామన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ ఇన్‌చార్జ్ వి పార్థసారధి మాట్లాడుతూ బ్యాంక్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలనే లక్ష్యంతో పూలపల్లిలో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ పీవీ రాధాకృష్ణ, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స వెంకట సూర్యనారాయణరాజు (డీటీడీసీ బాబు), రైస్‌మిల్లర్ వేగేశ్న రంగరాజు, అడబాల వెంకటరమణ, కొండ్రెడ్డి సత్యనారాయణ, పెచ్చెట్టి కోటేశ్వరరావు, బీఎం వై ఉదయ్, ఇన్‌చార్జ్ బీఎం పసుపులేటి రాజు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం జగన్



తూర్పుపాలెంలో రైతు గ్రూపులకు పవర్ టిల్లరును అందజేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులకు అండగా నిలిచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల పంపిణీలో భాగంగా రైతులకు అందించే పవర్ టిల్లరును మంగళవారం తూర్పుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో వడలికి చెందిన అగస్త్యేశ్వర జేఎల్‌జీ గ్రూపుకు అందజేశారు. దేశంలోనే వినూత్నంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతలకు అండగా నిలుస్తున్నారన్నారు. విత్తనం నుంచి పంట ఉత్పత్తుల అమ్మకాల వరకూ ఒకే చోట జరిగే విధంగా ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. రైతులందరూ సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు.

గృహనిర్మాణం వేగవంతం చేయాలి

నియోజకవర్గంలో గృహనిర్మాణం వేగవంతం చేయాలని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అన్నారు. అభివృద్ధి పనులు, గృహనిర్మాణంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోడూరు జెడ్పీటీసీ గుంటూరు పెద్దిరాజు, పార్టీ నాయకులు కాసాని పెద్దిరాజు, చిటికెన బాబీ, మద్దు శ్రీనివాసరావు, బండారు ప్రసాద్, మేకా సింహాద్రి అప్పన్న, చిటికెన శ్రీనివాసరావు, రంభ సూర్యనారాయణ పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతులకు ఉత్తమ సేవలు



సంఘ మహాజనసభ నిర్వహిస్తోన్న దృశ్యం

నరసాపురం: సొసైటీల ద్వారా ప్రభుత్వ సహకారంతో రైతులకు ఉత్తమ సేవలందిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్ సూచించారు. మంగళవారం పీఏసీఎస్ మహాజనసభ సంఘ సభ్యులు, రైతులు సమక్షంలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన బులిమస్తాన్ మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు తకవరలో డివిడెండ్ ప్రకటిస్తామని చెప్పారు. రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామన్నారు. ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నామన్నారు. బ్యాంకులో లాకర్ల సదుపాయం కల్పించామని చెప్పారు. సొసైటీని మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళిక తయారు చేస్తున్నామని వివరించారు. సంఘ కార్యదర్శి మేడిది శ్రీనివసారావు వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు.

సహకార సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలు



మహాజన సభలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ మోటుపల్లి రామభాస్కరరావు

నరసాపురం రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలందించనున్నట్టు మొగల్తూరు సొసైటీ చైర్మన్ మోటపల్లి రామభాస్కరరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం సంఘ కార్యాలయంలో నిర్వహించిన మహజన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.8,60,40,295 లావాదీవీలను సభ్యులు ఆమోదించారు. 2023–24 ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్ రూ.1కోటి 6లక్షల 5వేల 500 లును సంఘ కార్యదర్శి కొత్తపల్లి గోవింద్ ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో డైరక్టర్లు రేవు విజయలక్ష్మీ రాంబాబు, బొద్దుపల్లి సుబ్బారావు, రైతులు కొల్లాటి మూలాస్వామి, నిప్పులేటి మాణిక్యాలరావు, కొత్త ముత్యం పలువురు రైతులు పాల్గొన్నారు.

మేడపాడులో రూ. 54.25 లక్షలతో ఉపాధి పనులు



సచివాలయంలో ఉపాధిహామీ గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్‌పీ కత్తి నాగేశ్వరరావు

యలమంచిలి: మేడపాడు గ్రామంలో 2021–22 సంవత్సరంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రూ.54,25,037 నిధులతో వివిధ పనులు పూర్తి చేసినట్లు సోషల్ ఆడిట్ టీమ్ డీఆర్‌పీ కత్తి నాగేశ్వరరావు చెప్పారు. రెండు రోజులుగా సోషల్ ఆడిట్ బృందం ఉపాధి హామీ పథకంలో గ్రామంలో 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు చేసిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆ వివరాలను వెల్లడించేందుకు మంగళవారం ఏర్పాటుచేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా వివిధ అభివృద్ధి పనులు సిమెంట్ రోడ్లు, జగనన్న కాలనీల స్థల పూడిక, గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్ర నిర్మాణాలకు రూ.32,27,468 వెచ్చించినట్టు తెలిపారు. ఆ పనులకు కూలీలకు వేతనాలుగా రూ.21,97,569 చెల్లించినట్లు ఆయన వివరించారు. ఆ పనులన్నీ సక్రమంగా జరిగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా శాంతకుమారి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు వార్డు సభ్యులు గాది వరదయ్య, బాలం రాంబాబు, కుక్కల సూరయ్య, వర్ధనపు చిన్న గ్రామ కార్యదర్శి మన్నే మాధురి, సోషల్ ఆడిట్ టీం ఎస్ఆర్‌పీ డి రాజేంద్రరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పులపర్తి సునీల్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ తాడి ఇందిర, వీఎస్ఎ ఎం రాజశ్రీ పాల్గొన్నారు.

కలప ట్రాక్టరు స్వాధీనం



సిద్ధాంతంలో కలప ట్రాక్టరును స్వాధీనం చేసుకొన్న అటవీ శాఖాధికారులు

పెనుగొండ: సిద్ధాంతంలో టింబర్ డిపో నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం రేంజ్ ఫారెస్ట్ అధికారి షేక్ ఫిరోజ్ తెలిపారు. సోమవారం రాత్రి డిపో యజమాని ఫిర్యాదు మేరకు కలపను స్వాధీనం చేసుకుని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసున్నట్టు తెలిపారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నియోజకవర్గంలో ఎనిమిది కేంద్రాల్లో మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. కెమిస్ట్రీ–1, కామర్స్–1, సోషియాలజీ–1, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్–1 పరీక్షలు జరిగాయి. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 2,478మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 2,389 మంది పరీక్షలు రాశారు.

రైతులంతా కిసాన్ మేళాకు తరలిరండి

యలమంచిలి: మార్టేరు వరి పరిశోధన స్థానంలో బుధవారం నిర్వహించనున్న కిసాన్ మేళాకు మండలంలోని రైతులంతా తరలి వెళ్లాలని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి కోరారు. ఈ కిసాన్ మేళాలో సుస్థిర వ్యవసాయం, స్థిరమైన ఆదాయం అనే అంశంపై చర్చావేదిక ఉంటుందన్నారు. క్షేత్ర సందర్శన, వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన, క్విజ్ పోటీలు, రైతులతో శాస్త్రవేత్తల చర్చాగోష్ఠి జరుగుతుందన్నారు. శాస్త్రవేత్తలు రైతులకు అనేక సూచనలు, సలహాలు ఇస్తారన్నారు.

కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న నటీనట సంక్షేమ సమాఖ్య కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు అర్బన్: కళారంగానికి జాగు సత్యనారాయణ, మాదిరెడ్డి శ్రీనివాసరావు అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. పాలకొల్లు ఛాంబర్ కామర్స్ భవనంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా కళాకారులు ఐవీ రావు, గుండా మురళీనాయుడు, మద్దాల వాసు ఏకపాత్రాభినయం చేసి ఆహుతులను అలరించారు. ప్రముఖ రచయిత లింగం సత్యనారాయణ పునః ప్రచురించిన భగత్‌సింగ్ సాంఘిక నాటకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ధి, పలు కళా సంస్థల అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్, చవ్వాకుల సత్యనారాయణమూర్తి, గుండా రామకృష్ణ, కేవీఎస్ఆర్‌కే గోపాలకృష్ణ, రావూరి జవాహర్‌లాల్ నెహ్రూ(చాచా), గంటా ముత్యాలనాయుడు తదితరుల పాల్గొని సన్మాన గ్రహీతలను సత్కరించారు. సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకున్న నటీనట సంక్షేమ సమాఖ్య వర్కింగ్ అధ్యక్షుడు గుడాల హరిబాబును శాలువాతో సత్కరించారు. నటీనట సంక్షేమ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కత్తుల రామమోహన్, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, సీవీవీ సత్యనారాయణమూర్తి, వంగా నరసింహరావు, నీలంశెట్టి సత్యప్రసాద్, రావూరి అప్పారావు పాల్గొన్నారు.

స్వయంకృషితో కష్టపడితేనే అభివృద్ధి



సబ్‌కలెక్టర్ సూర్యతేజను సత్కరిస్తున్న ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్లు రాఘవరెడ్డి, శృతిరెడ్డి

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు మోటివేషన్ కంటే స్వయం క్రమశిక్షణ ముఖ్యమని సబ్ కలెక్టర్ యమ్. సూర్యతేజ తెలిపారు. స్థానిక ఆదిత్యా పాఠశాలలో సోమవారం రాత్రి నిర్వహించిన 16వ వార్షికోత్సవ వేడుకలకు సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ స్వయంకృషితో కష్టపడి అభివృద్ధిలోకి వచ్చిన వ్యక్తులకు ఇచ్చే గౌరవం చాలా గొప్పదని అన్నారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.వి రాఘవరెడ్డి, యస్ శృతిరెడ్డి, సైకాలజిస్ట్ యస్ సుధీర్ కుమార్, ప్రిన్సిపాల్ యస్ అయ్యపరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఆసరా సభ

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం పూలపల్లి అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఉదయం 9గంటలకు వైఎస్సార్ ఆసరా సభ నిర్వహిస్తామని ఏపీఎం కలిగితి జ్యోతి రాణి తెలిపారు. ఈ సభకు జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆమె వివరించారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే



ఎన్ఎస్ఎస్ శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్

నరసాపురం రూరల్: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవాతత్వంతో పనిచేయాలని డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎల్బీచర్లలో వైఎన్ కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్–1, యూనిట్–2 ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. సుమారు 100 మంది వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చినమిల్లి శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామంలోని ప్రధాన రహదారుల మీదుగా అక్షరాస్యత, పరిశరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ పలు అంశాలపై సర్వే నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులను గ్రామ వైసీపీ అధ్యక్షుడు బొడ్డు ఆశిష్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈ వంశీ, యాకోబు, విద్యార్థులు బి రవిచంద్రిక, ఆర్ రాణి, సాయి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్సార్ టీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్) : వైఎస్సార్ టీయూసీ 12వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. భీమవరం ఆటో యూనియన్ అధ్యక్షుడు యింటి సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా ఆటో డ్రైవర్లను ఆదుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆటో డ్రైవర్ల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా అండగా నిలుస్తామని తెలిపారు. అనంతరం సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మారోజు గణేష్‌ను సత్కరించారు. ముందుగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పంపన గోపి, గుజ్జుల నిరీక్షణరావు, చెన్నంశెట్టి వాసు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం గరగపర్రు రోడ్డులో విజయలక్ష్మి థియేటర్ సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్లను మంగళవారం మునిసిపల్ అధికారులు తొలగించారు. భీమవరం పట్టణ అభివృద్ధిలో భాగంగా తాడేపల్లిగూడెం రోడ్డులో అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో 67 ఇళ్లను తొలగించారు. అందులో 47 మందికి ఇప్పటికే ఇళ్ల పట్టాలను అందజేశారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇళ్లు తొలగింపులో నష్టపోయిన బాధితులకు టిడ్కో ఫ్లాట్లలో ఆశ్రయం కల్పించినట్టు ఏసీపీ గౌరు తెలిపారు. ఇళ్ల పట్టాలు ఇచ్చిన వారికి శాశ్వతంగా టిడ్కో ప్లాట్లు కేటాయిస్తామని అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని బాధితులకు వారు తెలిపారు.